# మౌనం మా ఇరువురి మధ్య...

(5వ పేజీ తరువాయి)

విద్యుత్‌లా ఓ ఆలోచన నా మస్తిష్కాకాశంలో తళుక్కుమంది. జేబులోంచి పెన్ను తీసి పెయింటింగ్ క్రిందుగా ఇలా రాశాను

"మిమ్మల్ని చాలా రోజుల్నుంచి గమనిస్తున్నాను. మీ అందం, మమతాను రాగాల్ని నింపుకున్న మీ కళ్ళు, మీలో నూటికి నూరుపాళ్లు మూర్తీభవించిన స్త్రీత్వం నన్ను చాలా ఆకర్షించాయి. ప్రతిరోజు మీ కోసమే ఇక్కడికి వస్తున్నాను. వద్దు అని ఎన్నిసార్లు అనుకున్నా మీకోసం ఇక్కడికి రాకుండా ఉండలేకపోయాను. నేను ఓ వారపత్రికాఫీసులో ఆర్టిస్టుని. కథలకి బొమ్మలేస్తుంటాను. నాలో మీ పట్ల కలిగిన ప్రేమకి నా హృదయం వేసిన మీ బొమ్మ ఇది. మీకు నా ప్రేమ కానుకగా సమర్పించాలనుకుంటున్నాను. కాదనకండి. నా ప్రేమ ఫలించకపోయినా మీకు స్నేహితుడిగా ఉండాలనుకుంటున్నాను. నేను నవ్వితే మీరు జవాబుగా నవ్వారు. కానీ నేను ప్రేమిస్తున్నానంటే జవాబుగా మీరు నన్ను ప్రేమించలేరని నాకు తెలుసు. మీరు నన్ను ప్రేమించాలనుకోవడం దురాశ అవుతుంది కూడా. ఎందుకంటే నేను మూగవాణ్ణి"

పెయింటింగ్‌ని చుట్టి ఆమె కందించాను. ఏమిటి అన్నట్లు చూసి ఆమె అందుకుంది. కాని నా దురదృష్టంకొద్దీ అప్పుడే స్కూటర్ రావడంతో పెయింటింగ్‌ని చూడలేదామె. ఆమె లేచి నిల్చుని స్కూటర్ దగ్గరకు వెళ్లడం, కూర్చోవడం, స్కూటర్ కదలడం క్షణంలో జరిగిపోయాయి.

ఆ మరుసటిరోజు అరగంట ముందుగా వెళ్లి బమ్మెర విగ్రహం అరుగుమీద కూర్చున్నాను. ఆమె రాక కోసం కళ్లింతలు చేసుకుని నిరీక్షిస్తూ ఆమె వస్తుందా? తను వేసిన బొమ్మను స్వీకరిస్తుందా? లేక తన ముఖం మీదికి గిరాటు వేస్తుందా? తనిలా ఆమెని గమనిస్తున్నానని తెలిసి రావడం మానేస్తుందా? ఏదో భయం, ఆందోళన నాలో చోటు చేసుకోసాగాయి. అరగంట తర్వాత ఆమె వచ్చింది. నా భయం ఆందోళన పటాపంచలయ్యాయి. ఎప్పటిలాగే అరుగుమీద కాస్త దూరంగా ఆమె కూర్చుంది నా వైపుకి చూస్తూ. నేనామె వైపుకు చూశాను కాస్త భయంగా. మా కళ్ళు కలుసుకున్నాయి. నేను చిన్నగా నవ్వాను. ప్రతిగా ఆమె నవ్వి వానిటి బాగ్ తెరిచి అందులో మడిచివుంచిన ఓ కాగితాన్ని తీసి నాకు అందించింది. నేను భయపడుతూనే దాన్ని తెరిచాను.

"మీరు నా కోసమే వస్తున్నారని నన్ను ప్రతిరోజు గమనిస్తున్నారని చాలా రోజుల్నుంచి నాకు తెలుసు. నేను మిమ్మల్ని గమనించినా గమనించనట్లే ఊరుకునేదాన్ని. ఏరోజైనా మీరు కాస్త ఆలస్యంగా వస్తే మీకోసం నా కళ్ళు అప్రయత్నంగా వెతికేవి. నా గురించి చెప్పాలంటే, ట్యాంక్‌బండ్ వెనుకవున్న ఓ చిన్న ఆఫీసులో టైపిస్టుగా పనిచేస్తున్నాను. అప్పుడప్పుడు కథలు రాస్తుంటాను. అందుకోసమే ఆఫీసు నుంచి ఇక్కడికి వస్తుంటాను. అన్నయ్యకు సికింద్రాబాద్‌లో ఉద్యోగం. ఇల్లు ఖైరతాబాద్‌లో ఉంది. ఆఫీస్ నుంచి ఇంటికి వెళ్లేటప్పుడు ప్రతిరోజు నన్ను పికప్ చేసుకొని వెళుతుంటాడు. మీరు వేసిన నా బొమ్మ చాలా బాగుంది. మీరు నా బొమ్మ వేసి నాకే కానుకగా ఇవ్వడం నా అదృష్టంగా భావిస్తున్నాను. మీలాగే మూగదాన్ని. మీరు నన్ను ప్రేమిస్తున్నారని రాశారు. నాకూ మీరంటే ఇష్టమే. నేను మూగదాన్ని కావడంతో నన్నెవరూ పెళ్లి చేసుకోడానికి ముందుకు రాలేదు. ఇన్నాళ్లు ఈ నాగరిక ప్రపంచానికి వేరుగా నా మౌనలోకంలో ఒంటరిగా నిర్లిప్తంగా బ్రతికాను. పిల్లనగ్రోవి శ్రావ్యమైన సంగీతాన్ని సృష్టిస్తుందని పుస్తకాల్లో చదవడం తప్పితే వినలేదు. కోకిల మధురంగా కూస్తుందని, సెలయేళ్లు గలగలమని పారుతాయని, పిచ్చుకలు కిచకిచమని ముక్కులు పొడుచుకుంటూ ప్రేమించుకుంటాయని తెలుసుకున్న జ్ఞానం తప్పితే అనుభవం లేదు. నా నీరవ నిశీథి జీవితంలో మరొక శ్రావ్యమైన సంగీతం అని అనుకుంటున్నాను. మీతో కలిసి ఒక కొత్త రాగమయ ప్రపంచాన్ని సృష్టించుకోవాలని ఉంది. కానీ... కానీ అది సాధ్యమా? నేను మూగదాన్ని అని తెలిసిన తర్వాత కూడా మీరు నన్ను ప్రేమించగలరా?'



చదవడం పూర్తిచేసి ఒక్క క్షణం కళ్లు మూసుకున్నాను నేను. తను మూగవాడని ఎంతో మంది గేలిచేసినా అసహ్యించుకున్నా ఉద్యోగం ఇవ్వకపోయిన తనేం అనలేకపోయాడు. తనూ ఆమెలాగే తన ఒంటరి ప్రపంచంలో మౌనంగా బ్రతికాడు. మూగవాణ్ణని తన కూతుర్నివ్వని మామయ్యను తనేం చేయగలిగాడు. తమలోని లోపాన్ని అర్థం చేసుకొని ఎంతమంది ఎంతవరకు జాలిపడి సహాయం చేయడానికి ముందుకు వచ్చారు. అందమైన వాళ్లు అందమైన వాళ్లను ప్రేమిస్తారు. డబ్బున్నవాళ్లు డబ్బున్నవాళ్లనే ఇష్టపడతారు. తమలాంటి వాళ్లను ఎవరు ప్రేమిస్తారు? ఎంతమంది పెళ్లిచేసుకోవడానికి ముందుకు వస్తారు? ఆలోచనల్నుంచి తేరుకుని కళ్లుతెరిచి ఆమెవైపుకు చూశాను.

ఆమె అంతకుముందు నుంచే నన్ను చూస్తుండడంతో మా కళ్ళు కలుసుకున్నాయి. ఆనందాతిశయంతో కాగితాన్ని మడిచి జేబులోకి తోసేసి ఆమెకు కాస్త దగ్గరగా జరిగి ఆమె చేతిని నా చేతిలోకి తీసుకుంటుంటే ఆమె కూడా నాకు కాస్త దగ్గరగా జరిగింది.